# కవిత

సమకాలీన కవిత్వ కాలావధిక







నందిని సిధారెడ్డి

తెలంగాణా సాహిత్య అకాడెమి అధ్యక్షులు

48

జూన్ 2017

# కవితా! 48

సమకాలీన కవితల కాలనాళిక

జూన్ - 2017

నిర్వాహక సంపాదకుడు : శ్రీశ్రీ విశ్వేశ్వరరావు
సెల్ : 94906 34849

సంపాదకుడు : బండ్ల మాధవరావు
సెల్ : 88976 23332

బుక్ మేకింగ్ : ఎ. గిరిధర్
సెల్ : 97042 44344

మాట్లాడండి ! రాయండి !! కలవండి !!!

సాహితీమిత్రులు
Regd. No. 48/2012/IV విజయవాడ.

28-10-26, మసీదు వీధి, అరండల్‌పేట, విజయవాడ - 2
ఫోన్ : 0866 2433359 సెల్ : 9392971359
editor.kavithaa@gmail.com కి కవితలు, వ్యాసాలు పంపండి.



కవుల, రచయితల అభిప్రాయాలు వారి వారి స్వంతం. అవన్నీ అనివార్యంగా పత్రిక అభిప్రాయాలు కానవసరం లేదు. - పబ్లిషర్స్


## ఇందులో కవులు, విమర్శకులు...


| | |
|---|---|
| సిరికి స్వామినాయుడు | నిఖిలేశ్వర్ |
| డా. మేజర్ సి.ఎస్. స్వామి | భగ్వాన్ |
| టి. వెంకటేష్ | సూర్యబ్రహ్మం |
| శ్రీరామ్ | హెచ్చార్కె |
| జనజ్వాల | సాహి |
| శారద ఆవాల | క్రాంతి |
| మెర్సీ మార్గరెట్ | ముకుంద రామారావు |
| మందరపు హైమవతి | డా. ఎన్.గోపి |
| స్వేచ్ఛ | గరికపాటి మణీందర్ |
| విజయ్ కోగంటి | అనిల్ డ్యాని |
| ఇంద్రగంటి శ్రీకాంతశర్మ | ఎస్.ఆర్.పృథ్వి |
| కె. శివారెడ్డి | నూకతోటి రవికుమార్ |
| ఉదయమిత్ర | మందలపర్తి కిశోర్ (అ) |
| సింగిడి రామారావు | డా. గుర్రం సీతారాములు(అ) |
| ఆర్. శాంతసుందరి (అ) | పి. రామకృష్ణ |
| క్రాంతి శ్రీనివాసరావు | ఖాదర్ షరీఫ్ షేక్ |


"నాగేటి సాల్లల్ల నా తెలంగాణా నా తెలంగాణా
నవ్వేటి బతుకులు నా తెలంగాణా నా తెలంగాణా"

తెలంగాణ ఉద్యమ కాలాన ఇంటింటా మార్మోగిన పాట. తెలంగాణ భూమి స్వప్నం ఆయన కాంక్షించిన స్వప్నం, నెరవేర్చుకున్న స్వప్నం. తెలంగాణ సామాజిక ఆర్థిక, సాంస్కృతిక సందర్భాలని తెలంగాణ యాసలో భాషలో పలికించిన వాడు. ఆయనే నందిని సిధారెడ్డి. తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమి ప్రథమ అధ్యక్షులు.

ఆయనతో నా పరిచయం భూమి స్వప్నంతో మొదలైంది. అక్కడి నుండి సంభాషణ, ప్రాణహితల మీదుగా 'ఇక్కడి చెట్ల గాలి' వరకు విస్తరించింది. ఆయనతో సంభాషణ, ఆయన కవిత్వం, ఉపన్యాసాలు నన్ను ఉత్తేజితుడ్ని చేస్తూనే ఉన్నాయి. బహుశ సిద్ధారెడ్డి రైతు బిడ్డ కావడం కూడా దీనికి కొంత కారణం అయి వుండవచ్చు. మట్టి నుండి బయలుదేరి మూలాల్ని మరవకుండా, నగరీకరణకు లొంగిపోకుండా తన అస్తిత్వాన్ని నిలుపుకుంటూ ఎందరికో ప్రేరణగా నిలవడం మాత్రమే కాక తెలంగాణ ఉద్యమ పోరాటంలో క్రియాశీలక పాత్ర వహించడం లాంటివన్ని ఆయన పట్ల నేను ఆకర్షితుడవడానికి కారణాలు. సిద్ధిపేట కేంద్రంగా నడిచిన సాహిత్యోద్యమాలకి ప్రధాన కేంద్ర బిందువు నందిని సిధారెడ్డి. మంజీర రచయితల సంఘం, తెలంగాణకు సిద్ధిపేటకు ఇచ్చిన కంట్రిబ్యూషన్‌ను మాటలలో కొలవలేము.

కవిగా సిధారెడ్డి స్థానం అత్యున్నతం. మట్టి అతని ప్రధాన కవితా వస్తువు. తెలంగాణ అతని చిరకాల స్వప్నం. స్వప్నం సాకారమయ్యాక అతనికి తెలంగాణ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించడం ముదావహం.

ఉద్యమకాలంలో ఆంధ్ర ప్రాంత ప్రజల మనోభావాల మీద ఏర్పడిన అపోహలను తొలగించి రాష్ట్రాలు రెండుగా వున్నా తెలుగు మన ఐక్యతారాగం అని, ఎల్లలు లేని తెలుగుకు సముచిత గౌరవం కల్పించే విధాన నిర్ణయాలను తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులుగా నందిని సిధారెడ్డి నుండి మనం ఆశించవచ్చు.

## ఖర్మభూమి

సిరికి స్వామినాయుడు 94940 10330

చీకటి స్వాతంత్ర్యమింకా
చీకట్లోనే...
చట్టాలు
కనిపించని ఖద్దరునీడలు
నాయకులు
కీచకుని వారసులు.
న్యాయస్థానాలు
కడదాకా నడచే వాయిదాలు
ఖర్మభూమి....జనారణ్యం
రక్షణ కరువైన సందర్భం !

ఏదీ...
పోత్రంతో రంకెలేస్తున్న
వాడి పురజాలమీద
ఒక్క తాపుతన్నవే తల్లీ...
వాడి అహంజెండా కూలిపోవాల.
నీ ఎదవేపుజూస్తున్న ఎంగిలి కళ్లను
చింతపండుకు పిక్కతీసినట్టు
పెరికెయ్యవే...
వాడి పొగరుకళ్లు పేలిపోవాల.
అంగాంగాన్నీ
ఓ ఆయుధం జేసుకోవే....
పాడు ఆలోచనకే....
వాడు భయకంపితుడు కావాల !

పూవులా గాదు
పదునెక్కిన ఖడ్గమవ్వాల.
సీతాకోకలా గాదు
చెట్లబెరళ్లను తొలిచే
చెకుముకిపిట్టవు గావాల.
అత్తిపత్తి కాదు - నీ దేహం
ముట్టుకుంటే కంపనమెత్తే
కరెంట్ తీగవ్వాల !

కలువపూలు కాదు కళ్లు
చీకటిరాత్రిలో మెరిసే
చిరుతపులి చూపవ్వాల.
బెండకాయలు కాదు వేళ్లు
పదునెక్కిన చురకత్తులవ్వాల.
కుందేలువు కాదు
గదిలో తెగించి తిరగబడ్డ
ఆడపులివి గావాల !

ఆడది ఘర్జిస్తే....
అర్ధరాత్రి సూరీడు తుళ్లిపడి లేవాల.
ఆకాశంలో సగం కాదు
అనంతవిశ్వమే నీవవ్వాల !! ■

## అన్వేషణే !

నిఖిలేశ్వర్ 9177881201

ఆత్మశోధనా?
ఆత్మహననమా?
అంతులేని దాహమా?
నలుమూలలా
పెనుమార్పుకోసం
కవితాక్షరాల వెంట
తన్మయత్వంతో
అవిశ్రాంతంగా
అహరహంతపించే
ఈజీవితమంతా
అన్వేషణే !! ■



# మంచు

డా. మేజర్ సి.ఎన్. స్వామి 86009 91346

ఎటు చూసినా
మంచే మంచు
సన్నని సూక్ష్మమైన
ఒక తెల్ల దుప్పటిలా
ఎటు చూసినా
మంచే మంచు
పది గజాల
దూరం వరకు
ఏమీ కనబడకుండా
తడుము కుంటూ
మనుష్యులు
నడుస్తూ ఉండడం వల్ల
నగర సంచాలనం
డీలాపడి

కుంటుపడినట్లుంది
మంచు
కోహరమ్ తో
మందగించిన
జీవన పరుగు పై
మంచితనం
కబంధ హస్తాలతో
బిగింపు బలం పుంజుకుంది
జీవనయానంపై
ప్రభావం చూపింది
మంచు,
నాలుగు ప్రక్కల నుండి
ఎటు చూసినా
మంచే మంచు. ■



# పుట్టుక

భగ్వాన్

చెట్లు మారాకులు తొడుగుకున్నంత
సహజంగానా
చిన్ని చిన్ని పుడకలతో ఎండు గడ్డి పోచలతో
పిట్ట, గూడు కట్టిన తీరుగానా
గాలి ఆగాగి అంచెలంచెలుగా వీచివీచి
సన్నసన్నగా మేను తాకిన పద్ధతిగానా
బుజ్జమ్మా, నువ్వెలా వస్తావు
వచ్చేటప్పుడు నాకు చెబుతావు కదూ......

కిటికీ ఊచల సాయంతో పువ్వుల తీగ
కప్పును అందుకున్నంత అందంగానా!
హార్మోనియం మెట్ల మీద వేళ్ళు
వయ్యారంగా నర్తించినంత ఆనందంగానా
అడవిలో మునులు ముక్కు మూసుకుని
తపమాచరిస్తున్నంత మౌనంగానా!
ఎలా నీ రాక అమ్మడూ!?
వచ్చేటప్పుడు నాకు గుర్తు చేస్తావు కదూ. ..

చెట్టు మాను గరగరలకో
బండరాతి పగుళ్ళ చర్మానికో
తన శరీరాన్ని రాసుకుని రాసుకుని
నాగు కుబుసం విడిచే విధంగానా !
కొండ వదలిన జలధార
నదైన, దృశ్యమంత ఆహ్లాదంగానా!
ఎలా వస్తావు కన్నా! ?
నువ్వు వస్తున్నావని నాకెలా తెలుస్తుంది.

ఓ తల్లీ! నువ్వు వచ్చేటప్పుడు
పూల వాన కురుస్తుందా !
అమ్మ నీళ్ళ చెంబుతో ఎదురొస్తుందా !
పసి పిల్లలు దీవిస్తారా !
ఆడపడుచులు హారతి పడతారా !
జీవన గమన రహస్యాల్ని రహస్యంగా
ఎవరైనా నీ చెవిలో చెబుతారా!

పుట్టేంత వరకే పుట్టుక
మరి పుట్టాకా ......అది జీవితం
నేననుభవించిన నా జీవన సందర్భాలన్నీ
ఇప్పటికీ నా గుండెలో
తిరగబడిన బొద్దింకల్లా కొట్టుకుంటున్నాయి ■

# తేట నుంచి తేమలోకి

టి. వెంకటేష్ 99853 25362

మరణించిన ఎరుక ఆకుపచ్చని నీడై
మొగ్గ తొడిగింది
పెచ్చులు రాలిన మినార్ పై చిలుక వాలినట్టు
నా ఒంటిపై ముదురాకు పచ్చ జుబ్బా
దేహమంతా పరచుకున్న ఆకుపచ్చ ఛాయ
దేశదిమ్మరిని అంటుకున్న జ్ఞాన ధూళిలా
గుండె నిండా పరచుకున్న పురా పరిమళం
కలిసిన జాడల కాలం గణించే ఓపిక లేదు

పరిచయంలోనే జుబ్బాను కౌగిలించుకున్న కళ్ళు
కళ్ళల్లో పచ్చని మొక్కలా విచ్చుకున్న నేను
మఖ్మల్ వస్త్రానికంటిన అత్తరులా
లే లేత స్పర్శకు నైలులో మునిగి
గంగలో తేలిన తేట అనుభూతి
కాలం రెప్పల మాటున నిదురోయిన కళ్ళు
జీర్ణపత్రమై బడలికతో ఒళ్ళు
చిగురు తొడిగిన వసంతంలా జుబ్బా
చచ్చి ఈ ఒంటిపై మరలా బతికి
గుండె పై పారాడుతోన్న ఆకుపచ్చని నీడ
మధువు లో మునిగి గుండె లో దాగి
కళ్ళల్లో మంచు కణమై తొంగిచూస్తోంది

సెల్ లో కబీ తన్హాయి ...రింగ్ టోన్
మెత్తగా పాకుతోంది
పరవశించి పరవశించి పలవరించిన స్వరం
నాలుగు గోడల మధ్య మూగగా కుములుతోంది
స్వరం తెగిన టేపు అనాథగా చూస్తోంది
ఆత్మ దిగులును పంచుకోని వేణువొకటి
తీయగా నిదురోతోంది

చక్కెర దేహానికి చేదుసౌందర్యమేలన్న
తథాగతుని జాలి, జాలిగా రాలుతోంది
ఎదురుగా పాత మిత్రుడు కొత్తగా కనబడుతున్నాడు
జ్ఞానం అక్షరమై పూసిన తోటంతా పచ్చ పచ్చగా
ఆకుపచ్చగా...ముదురాకు పచ్చగా... ■

# ఈ పూట

సూర్య బ్రహ్మం 8885326608

మిట్ట మధ్యాహ్నం
అందులోనూ వేసవి
నిప్పుల కుంపటి
నెత్తిన పోసిన రీతిగా
నింగి నుండి భానుడు
ఝళిపిస్తే పంజాను
చెట్టు నీడకై వెతికాను
దొరకలేదు దొరకలేదు
ఏ చెట్టంటూ నాకు
కడుపులో ఆకలి
పేగులును పట్టి
పీడిస్తుంది .......
అయ్యో !
నెత్తి ఎండకు కాలుతున్నా
కడుపు ఆకలితో కాలుతున్నా
కేకలేస్తున్నా....., వేగలేక
పిచ్చోడని నన్నంటే
పర్వాలేదు ......
పచ్చడి మెతుకులన్నా
నాకు ఇవ్వు ......
ఈ పూట. ■



విశ్వేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న ఈతకోట సుబ్బారావు, తుంగా శివప్రభాత్ రెడ్డి, భువనచంద్ర, చిన్ని నారాయణరావు, ఉమా, మాధవరావులు

# శ్రీశ్రీ సన్మానం

శ్రీరామ్ 99634 82597

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా రచయితల సంఘం (శ్రీపొనెరసం) వారు 2017 శ్రీశ్రీ పురస్కారాన్ని ఈ యేడు విజయవాడకు చెందిన శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావుకు అందజేశారు. ఈ యుగం నాదీ అని సగర్వంగా ప్రకటించుకున్న మహాకవి శ్రీశ్రీ కవితా భావజాలాన్ని విస్తృతపరచిన సాహితీ సేవకులకు శ్రీపొనెరసంవారు ప్రతియేటా పురస్కారంతో సత్కరిస్తున్నారు. సమాజం పట్ల సాహిత్య ప్రయోజనం ఎప్పుడూ సామాన్యుడి పక్షంగా వున్నప్పుడే సాధ్యపడుతుందని శ్రీశ్రీ తన రచనల ద్వారా తెలియజేశారని సభలో వక్తలు మాట్లాడారు. ముఖ్యఅతిధిగా విచ్చేసిన సినీపాటల రచయిత, కవి భువనచంద్ర మాట్లాడుతూ శ్రీశ్రీ కవిత్వంలోని లయాత్మకత గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. శ్రీశ్రీ కవిత్వంలో వున్న రిథమ్‌వల్లే, ఈ రోజుకీ ఆయన కవితలు జనసామాన్యాన్ని ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు.

కవి బండ్ల మాధవరావు మాట్లాడుతూ సమాజంలోని అసమానతలు, కష్టజీవి జీవన పార్శ్వాల్లోని వెలుగునీడలు శ్రీశ్రీ కవిత్వంలో ఎంతో ప్రభావవంతంగా ప్రతిఫలించాయని కొనియాడారు. అంతటి మహాకవి ఆశయాలను పుణికిపుచ్చుకున్న మార్క్సిస్టు విశ్వేశ్వరరావుని, అతని జీవిత పర్యంతమూ,

**End of Preview.**

**Rest of the book can be read @**

[http://kinige.com/book/Kavitaa+48](http://kinige.com/book/Kavitaa+48)

* * *